మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర సంపుటి : 08 సంచిక : 225 శనివారం 21 - 02 - 2026 పేజీలు: 8 వెల: 4

## విద్యార్థుల సంక్షేమంపై ఎంపీడీవో ఫోకస్



2లో..

## కృత్రిమ మేధ దత్తాంశ కేంద్రంగా

# విశాఖ

- సాంకేతిక రంగంలో ప్రపంచ పటంలో ఏపీకి స్థానం లక్ష్యం
- భారత్ మండపంలో రౌండ్ టేబుల్ సమావేశంలో చంద్రబాబు దార్శనికత
- లోతైన సాంకేతిక రంగాల్లో భారీ పెట్టుబడుల ఆకర్షణకు ప్రణాళిక





మన గళం, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌ను సాంకేతిక రంగంలో ప్రపంచ పటంలో నిలబెట్టడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సమీప భవిష్యత్తులో అమరావతి క్వాంటం వ్యాలీగా, విశాఖపట్నం కృత్రిమ మేధ దత్తాంశ కేంద్రంగా అంతర్జాతీయ గుర్తింపు పొందుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంకల్పానికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ తన వంతు పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఢిల్లీలోని భారత్ మండపంలో ప్రపంచ ఆర్థిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన భారత కృత్రిమ మేధ ప్రభావ సదస్సులో భాగంగా జరిగిన చర్చా వేదికలో చంద్రబాబు పాల్గొన్నారు. కృత్రిమ మేధస్సు ద్వారా పోటీతత్వం అనే అంశంపై జరిగిన ఈ సమావేశంలో కేంద్ర సమాచార సాంకేతిక, దూరసంప్రేక్షణ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, ప్రపంచ ఆర్థిక వేదిక ప్రధాన కార్యనిర్వాహణ అధికారి బోర్కే బ్రెండే తదితరులతో కలిసి ఆయన ప్రసంగించారు ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, అమరావతి క్వాంటం వ్యాలీ గురించి

2 లో..



## ప్యాక్స్ సిలికాపై భారత్‌అమెరికా

# సంతకాలు

- కృత్రిమ మేధ ప్రభావ సదస్సులో కీలక నిర్ణయం
- అర్ధవాహక రంగంలో వ్యూహాత్మక భాగస్వామ్యం
- ప్రపంచ స్థాయిలో భారత ప్రతిభకు గుర్తింపు

మన గళం, న్యూఢిల్లీ : అమెరికాకు చెందిన ప్యాక్స్ సిలికాతో భారత్ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఢిల్లీలో నిర్వహించిన కృత్రిమ మేధ ప్రభావ సదస్సు సందర్భంగా ప్యాక్స్ సిలికా ప్రకటనపై రెండు దేశాలు సంతకాలు చేశాయి. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, అమెరికా ప్రతినిధి సెర్గియో గోర్ సమక్షంలో ఈ ప్రకటనపై సంతకాలు జరిగాయి. కార్యక్రమంలో

2 లో..



కాంగ్రెస్ తీరు దేశానికి

# అవమానం

- దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే రాజకీయాలు సరికాదని వ్యాఖ్య
- దగ్గుబాటి పురందేశ్వరి విమర్శలు

మన గళం, అమరావతి : భారతీయ జనతా పార్టీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కాంగ్రెస్ పార్టీ వ్యవహారశైలిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. భారత్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రపంచ కృత్రిమ మేధ సదస్సును నిర్వహిస్తున్న సమయంలో కాంగ్రెస్ పార్టీ గందరగోళం సృష్టించిందని ఆమె ఆరోపించారు. దేశ గౌరవాన్ని పక్కనపెట్టి

2 లో..

## శ్రీవారి చిత్రపటాల అవమానంపై లోకేశ్ ఆగ్రహం



2 లో..

## భారత్ మండపంలో యూత్ కాంగ్రెస్

# నిరసన కలకలం



- కృత్రిమ మేధ ప్రభావ సదస్సు సమయంలో ఆకస్మిక ఆందోళన
- నిరుద్యోగం, ధరల పెరుగుదలపై నినాదాలు
- భద్రతా లోపాలపై అధికారుల ఆరా

మన గళం, న్యూఢిల్లీ : ఢిల్లీలోని భారత్ మండపంలో శుక్రవారం యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ఆకస్మికంగా ఆందోళన చేపట్టి కలకలం రేపారు. దేశంలో జరుగుతున్న కృత్రిమ మేధ ప్రభావ సదస్సు సందర్భంగా కొందరు కార్యకర్తలు హఠాత్తుగా చొక్కాలు విప్పి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సమావేశ ప్రాంగణంలో కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. నిరుద్యోగం, ధరల పెరుగుదల, భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందం వంటి అంశాలను ప్రస్తావిస్తూ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి రాజీపడిన నాయకుడని ఆరోపిస్తూ గట్టిగా నినాదాలు చేశారు. సమావేశ ప్రాంగణంలోని

2 లో..

## గుంటూరులో ఉపాధి హామీ చట్ట పరిరక్షణ యాత్ర

- మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి నివాళి
- తెనాలిలో రచ్చబండకు ప్రజల అశేష స్పందన
- గ్రామీణాభివృద్ధిలో ఉపాధి హామీ చట్టం పాత్ర వివరణ

గుంటూరు, ఫిబ్రవరి 20 ,మన గళం : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్ట పరిరక్షణ యాత్ర నేడు గుంటూరు జిల్లాలో కొనసాగింది. కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ షర్మిల ముందుగా మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం తెనాలి పట్టణంలో రచ్చబండ నిర్వహించగా

2 లో..



## శాసనమండలిలో మహాపచారం

# ఆరోపణలు

- వెంకటేశ్వర స్వామి చిత్రాలతో వైఎస్సార్సీపీ ఆందోళనపై వివాదం



మన గళం, అమరావతి : శాసనమండలిలో వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు చేపట్టిన నిరసన తీవ్ర రాజకీయ దుమారానికి దారి తీసింది. వెంకటేశ్వర స్వామి చిత్రాలను పట్టుకుని చెప్పులు, బూట్లు ధరించినట్టుగా ప్రవర్తించారని కూటమి నేతలు ఆరోపిస్తూ దీనిని మహాపచారంగా అభివర్ణించారు. సభలో ఈ ఘటనపై తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. గందరగోళ పరిస్థితుల మధ్య మండలి ఛైర్మన్ సభను వాయిదా వేశారు. సభ వాయిదా అనంతరం వైఎస్సార్సీపీ సభ్యులు ప్లకార్డులు, స్వామి చిత్రాలను టేబుల్‌పై వదిలి వెళ్లారని కూటమి నేతలు ఆరోపించారు. ఈ చర్య

2 లో..

# ప్యాక్స్ సిలికాపై భారత్‌అమెరికా సంతకాలు




అమెరికా ఆర్థిక వ్యవహారాల మంత్రి జాకబ్ హెల్‌బర్గ్ కూడా పాల్గొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీసుకుంటున్న విధానాల వల్ల ప్రపంచవ్యాప్తంగా భారత్‌పై విశ్వాసం పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. అర్ధవాహక సరఫరా, ఉత్పత్తి, సూక్ష్మ చిప్ రూపకల్పన వంటి కీలక అంశాలు ఈ భాగస్వామ్యంలో భాగమవుతాయని తెలిపారు. భారతీయ ఇంజినీర్లు అత్యాధునిక సూక్ష్మ స్థాయి చిప్‌ల రూపకల్పనలో ముందంజలో ఉన్నారని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అర్ధవాహక పరిశ్రమలకు విస్తృత స్థాయిలో నైపుణ్యం కలిగిన నిపుణులు అవసరమవుతారని, ఆ అవసరాన్ని తీర్చగల శక్తి భారత్‌కు ఉందని స్పష్టం చేశారు. భారత సమాచార సాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచ దేశాలు విశ్వసిస్తున్నాయని పేర్కొన్నారు. గత సంవత్సరం డిసెంబర్‌లో అమెరికా ప్యాక్స్ సిలికా సమూహాన్ని ప్రారంభించింది. ఇందులో జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్, నెదర్లాండ్స్, బ్రిటన్, ఇజ్రాయిల్, ఐక్య అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియా వంటి దేశాలు భాగస్వాములుగా ఉన్నాయి. సురక్షితమైన, వినూత్న సిలికాన్ వ్యవస్థలను అభివృద్ధి చేయడం, కృత్రిమ మేధ ఆధారిత సాంకేతికతను బలోపేతం చేయడం ఈ సమూహ లక్ష్యంగా పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా దేశీయ తయారీ రంగానికి కొత్త దిశ లభించే అవకాశాలు ఉన్నాయని నిపుణులు భావిస్తున్నారు. అర్ధవాహక తయారీలో భారత్‌ను ప్రపంచ కేంద్రంగా నిలబెట్టే దిశగా ఇది కీలక అడుగుగా మారనుందని కేంద్ర ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేసింది.

# కృత్రిమ మేధ దత్తాంశ కేంద్రంగా విశాఖ





ప్రపంచం మాట్లాడే రోజు దూరంలో లేదన్నారు. కేవలం సాంకేతికతను వినియోగించుకోవడమే కాకుండా, క్వాంటం గణన పరికరాలను తయారు చేసి ప్రపంచానికి ఎగుమతి చేసే ప్రత్యేక వ్యవస్థను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రముఖ అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులతో విశాఖపట్నం కీలక కృత్రిమ మేధ దత్తాంశ కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. పౌరులందరికీ ప్రయోజనం కలిగే విధంగా స్వయంప్రతిపత్తి కలిగిన కృత్రిమ మేధ వ్యవస్థను వినియోగించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. లోతైన సాంకేతిక రంగాల్లో రాష్ట్రాన్ని ముందంజలో నిలపాలని లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే అంతరిక్ష, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, వైద్య సాంకేతిక పార్కులు ఉన్నాయని, ఈ రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఆయన పునరుద్ఘాటించారు.

# కాంగ్రెస్ తీరు దేశానికి అవమానం

అంతర్జాతీయ వేదికపై భారత్‌ను అగౌరవపరిచేలా వ్యవహరించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ కార్యకర్తలు సదస్సు వేదిక వద్ద చొక్కాలు విప్పి నిరసన వ్యక్తం చేశారని తెలిపారు. భారత్ తన సాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పే కీలక సమయంలో ఉద్దేశపూర్వకంగానే ఈ చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్ఠను దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టారని ఆమె వ్యాఖ్యానించారు. భారత్ సాంకేతిక రంగంలో ముందంజలో నిలవడానికి కృషి చేస్తున్న తరుణంలో ఇలాంటి ప్రవర్తన అనవసరమని పురందేశ్వరి అన్నారు. రాజకీయ భేదాభిప్రాయాలు ఉండొచ్చు గానీ దేశ ప్రయోజనాలను పక్కనపెట్టి వ్యవహరించడం సమంజసం కాదని స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయిలో భారత్ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందని పేర్కొన్నారు. దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్యలను ప్రజలు సమర్థించరని ఆమె అభిప్రాయపడ్డారు. రాజకీయ పోరాటం ప్రజాస్వామ్య పరిమితులలోనే జరగాలని, అంతర్జాతీయ వేదికలపై దేశాన్ని అపకీర్తి పరచే విధంగా వ్యవహరించడం తగదని ఆమె స్పష్టం చేశారు.

# భారత్ మండపంలో యూత్ కాంగ్రెస్ నిరసన కలకలం

ప్రదర్శన పలక ముందు నిలబడి మరింత గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి ఆందోళనకారులను బయటకు తీసుకెళ్లి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని తిలక్ మార్గ్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్న ఈ ఉన్నత స్థాయి సమావేశంలో భద్రతా వ్యవస్థను దాటుకుని కార్యకర్తలు లోపలికి ఎలా ప్రవేశించారనే అంశంపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ నిరసనకు సంబంధించిన దృశ్యాలను యూత్ కాంగ్రెస్ తమ సామాజిక మాధ్యమ ఖాతాలో విడుదల చేసింది. ప్రభుత్వం జాతీయ ప్రయోజనాల కంటే సంస్థల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోందని యూత్ కాంగ్రెస్ ప్రకటనలో ఆరోపించింది. ఈ ఘటన అనంతరం భారత్ మండపం పరిసరాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. కాగా, ఈ సదస్సును రాహుల్ గాంధీ గతంలోనే ఒక ప్రచార కార్యక్రమంగా విమర్శించిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ వేదికపై ఇలాంటి నిరసనలు సముచితం కాదని అధికార పార్టీ నాయకులు అభిప్రాయపడగా, ఇది తమ నిరసన తెలిపే ప్రజాస్వామ్య హక్కు అని విపక్ష నాయకులు సమర్థించారు.

# గుంటూరులో ఉపాధి హామీ చట్ట పరిరక్షణ యాత్ర





నియోజకవర్గ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఉపాధి హామీ చట్టం పాత్రను వివరించారు. ఉపాధి హామీ ద్వారా ప్రతి కుటుంబానికి వంద రోజుల పని హక్కుగా మారిందని, గ్రామీణ ప్రాంతాల్లో వలసలు తగ్గాయని పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఈ చట్టం దోహదపడిందని వివరించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీసుకొచ్చిన కొత్త పథకం వల్ల గ్రామీణ కార్మికులకు నష్టం కలిగే అవకాశం ఉందని యాత్రలో అవగాహన కల్పించారు. ఉపాధి హామీ చట్టాన్ని గాంధీజీ పేరుతోనే కొనసాగించాలని శ్రామికులు డిమాండ్ చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రజల జీవనోపాధిని కాపాడేందుకు ఈ యాత్ర కొనసాగుతుందని, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని వైఎస్ షర్మిల స్పష్టం చేశారు.

# శాసనమండలిలో మహాపచారం ఆరోపణలు

హిందువుల మనోభావాలను దెబ్బతీసిందని మంత్రులు మండిపడ్డారు. శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సభలోనే తీవ్రంగా స్పందించారు. దేవుడికి అవమానం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తదనంతరం మంత్రి లోకేశ్ నేతృత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్సీలు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. మండలి ఛైర్మన్‌ను కలిసి వైఎస్సార్సీపీ సభ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పేవరకు విషయాన్ని వదిలిపెట్టమని హెచ్చరించారు. మండలి ఛైర్మన్ సభ్యులను పిలిచి మాట్లాడతానని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీల తీరు కారణంగా వరుసగా నాలుగో రోజు కూడా శాసనమండలి దద్దరిల్లిందని కూటమి, పీడీఎఫ్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు చర్చకు నోచుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు కూటమి నేతలు సిద్ధమవుతున్నట్లు సమాచారం.



# శ్రీవారి చిత్రపటాల అవమానంపై లోకేశ్ ఆగ్రహం

అమరావతి, ఫిబ్రవరి 20,మన గళం : వైసీపీ ఎమ్మెల్సీలు శాసనమండలిలో కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి చిత్రపటాలను అవమానించారని ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది క్షమించరాని పాపమని పేర్కొంటూ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేవుడిపై భక్తి, భయం లేవని, హిందువుల మనోభావాలను లెక్క చేయలేదని మండిపడ్డారు. తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ అయ్యిందన్న ఆరోపణల నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వైసీపీ సభ్యులు శుక్రవారం శాసనమండలికి శ్రీ వేంకటేశ్వర స్వామి చిత్రపటాలతో హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు బూట్లు, చెప్పులతోనే స్వామివారి చిత్రపటాలను పట్టుకుని ప్రదర్శించారని, సభ ముగిసిన తరువాత వాటిని అక్కడే వదిలేసి వెళ్లిపోయారని లోకేశ్ ఆరోపించారు. ఈ చర్యలు హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసినవని అన్నారు. ఈ ఘటనపై స్పందిస్తూ లోకేశ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శ్రీవారికి చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు మరింత పెద్ద తప్పు చేశారని వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు. వైసీపీ ఎమ్మెల్సీలు బూట్లు, చెప్పులతో స్వామివారి చిత్రపటాలను పట్టుకోవడం మహాపరాధమని అన్నారు. అంతేకాకుండా మండలిలో ప్రదర్శించిన చిత్రాలను అక్కడే వదిలి వెళ్లిపోవడం క్షమించరాని పాపమని పేర్కొన్నారు. ఈ విషయానికి సంబంధించిన వీడియోను కూడా నారా లోకేశ్ విడుదల చేశారు. శ్రీవారి పట్ల గౌరవం చూపకపోవడం ప్రజలు సహించరని ఆయన హెచ్చరించారు. ఈ ఘటనపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది.

## ఇన్సెక్టిసైడ్స్ (ఇండియా) లిమిటెడ్ క్యాంపెనీ ప్రతినిధులు ప్రోడక్ట్ స్టీవర్డ్షిప్ డే

మనగళం కర్నూలు : కల్లూరు మండల పరిధిలో ఆర్. కొంతలపాడు గ్రామం లో ఇన్సెక్టిసైడ్స్ (ఇండియా) లిమిటెడ్ క్యాంపెనీ ప్రతినిధులు ప్రోడక్ట్ స్టీవర్డ్షిప్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ రైతులకు పురుగుమందుల వాడకంపై, కొనుగోలు సలహాలు సూచనలు, సరైన మందుల ఎంపిక, సరైన మోతాదులో వాడకం మరియు వాటిని భద్రపరుచుటలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన కల్పించారు. రైతుల కు ఎలాంటి విషయాలైన తాము సూచనలు ఇస్తామని భరోసా ఇచ్చారు... ఈ కార్యక్రమంలో కె. కిరీటి (ఫీల్డ్ మార్కెటింగ్ మేనేజర్), ఎస్. మహబూబ్ భాషా (ఎస్ ఎస్ ఓ) మరియు రాఘవయ్య పాల్గొన్నారు...

## ఏపీఎస్ఆర్టీసీ బస్సులు మళ్లించాలంటూ డిపో మేనేజర్‌ను కలిసిన బీజేపీ నాయకులు






మన గళం మార్కాపురం జిల్లా ఎర్రగొండపాలెం నియోజకవర్గం పెద్దారవీడు మండలం మద్దలకట్ట గ్రామంలో ఇటీవల హైవే రోడ్డు నిర్మాణం పూర్తవడంతో గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగవుతుందని ఆశించారు. అయితే దోర్నాల నుండి విజయవాడ మరియు హైదరాబాద్ వెళ్లే ఏపీఎస్ఆర్టీసీ బస్సులు మద్దలకట్ట గ్రామంలోకి ప్రవేశించకుండా నేరుగా హైవేపైనే ప్రయాణిస్తున్నాయి. దీంతో గ్రామ ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు మరియు వృద్ధులు బస్సులు ఎక్కడానికి దూరం నడవాల్సి వస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు ఈరోజు మార్కాపురం జిల్లా ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. హైవేపై వెళ్లే బస్సులను మద్దలకట్ట గ్రామంలోకి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. గ్రామ ప్రజల ప్రయాణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని బస్సుల రూట్‌లో మార్పులు చేయాలని నాయకులు స్పష్టంగా పేర్కొన్నారు.

ఈ సందర్భంగా డిపో మేనేజర్ ప్రజల సమస్యను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. గ్రామ ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా అందే వరకు తమ పోరాటం కొనసాగుతుందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు.

జై శ్రీరామ్ జై జై శ్రీరామ్
ఇట్లు
బొచ్చు కోటిరెడ్డి, బీజేపీ
పెద్దారవీడు, మార్కాపురం జిల్లా

# షార్ట్ సర్క్యూట్‌తో రైతు పొలంలో అగ్నిప్రమాదం

**– రూ.2 లక్షల నష్టం**





మన గళం : మార్కాపురం జిల్లా పెద్దారవీడు మండలం శివాపురం గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదం స్థానికంగా ఆందోళన కలిగించింది. గ్రామానికి చెందిన రైతు ఆనేకాళ్ళ వెంకట రంగా రెడ్డి పొలంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ. 2 లక్షల విలువ చేసే డిప్పు పైపులు పూర్తిగా అగ్నికి ఆహుతి అయినట్లు రైతు తెలిపారు. ప్రమాదం గమనించిన స్థానికులు వెంటనే పరుగెత్తుకుని వచ్చి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ అప్పటికే పైపులు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనతో రైతు వెంకట రంగా రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సాగు పనుల కోసం కొనుగోలు చేసిన పైపులు నాశనం కావడంతో తనకు భారీ నష్టం వాటిల్లిందని ఆయన వాపోయారు. ఈ సంఘటనపై సంబంధిత అధికారులు స్పందించి, నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వ తరఫున తక్షణ ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. రైతును ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

# అంబేద్కర్ రాజ్యాంగం కు గౌరవం ఎక్కడ?? సీపీఐ



మన గళం అవుకు : 2026 అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా అవుకు మండల సిపిఐ పార్టీ నాగాంజనేయులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశించిన సాంఘిక న్యాయం స్వేచ్ఛ సమానత్వం నేడు పాలకుల కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల ప్రమాదంలో పడ్డాయి. ప్రధాని మోడీ 12 సంవత్సరముల పాలనలో ప్రజాస్వామ్యాన్ని కాలరాశి రాజ్యాంగానికి ఏ మాత్రము గౌరవం ఇవ్వడం లేదు. పైగా పూర్తి మెజారిటీ వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామంటూ గత ఎన్నికల్లో బిజెపి ప్రచారానికి ఒడిగట్టింది. అధికారం వచ్చాక రాజ్యాంగ సంస్థలను పాలకులు చేతిలోకి తీసుకుని గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారు. నేటికీ దేశంలో కుల మత లింగ వివక్షలు కొనసాగుతున్నాయి. మోడీ పాలన సహకారంతో కార్పోరేట్లు దేశ సంపదని సొంతం చేసుకుంటున్నారు. దేశవ్యాప్తంగా ఉన్నత విద్యాలయాల్లో ఐదు సంవత్సరములుగా కుల వివక్ష 118 శాతానికి పెరిగిపోయింది ఇంకా అనధికారికంగా ఎన్నో ఉన్నాయి. మైనారిటీల మీద మత విద్వేషాన్ని రెచ్చగొడుతుంది. అలాగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి తూట్లు పొడిచే విధంగా మార్పు చేస్తున్నారు . వీటన్నిటి పైన న్యాయపోరాటం చేయాల్సింది ఎంతో ఉన్నది వీటన్నిటిని రూపుమాపేందుకే భారత కమ్యూనిస్టు పార్టీ ఉందని వీటన్నిటికొరకే పోరాడుతామని భారత కమ్యూనిస్టు పార్టీగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అందే రమేష్ ,పుల్లయ్య, శేషాద్రి ,రజాక్ భాష ,సోను, మల్లికార్జున, సునీల్, కిట్టు ,కాసుల రమణ అలాగే రైతు సంఘం నాయకులు మద్దిలేటి రామాంజనేయులు, జనార్ధన్, లక్ష్మీనారాయణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంక్షేమంపై ఎంపీడీవో ఫోకస్

**– హాస్టల్ తనిఖీ, స్టడీ అవర్స్‌పై కఠిన ఆదేశాలు**





మన గళం మార్కాపురం జిల్లా : ఎంపీడీవో జాన్ సుందరం విద్యార్థుల సంక్షేమం, విద్యా నాణ్యత మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించారు. పెద్దారవీడు గ్రామ పంచాయతీలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించి వసతి, భోజనం నాణ్యత, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం వంటి సదుపాయాలను సమగ్రంగా పరిశీలించారు. హాస్టల్ పరిసరాలను స్వయంగా పరిశీలించిన ఎంపీడీవో, విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఏవైనా లోపాలు ఉన్నట్లయితే వెంటనే సరిదిద్దాలని సిబ్బందికి కఠిన ఆదేశాలు జారీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు సమయానికి పౌష్టికాహారం అందించాలని, తాగునీరు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, పారిశుధ్యంపై ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే హాస్టల్ రికార్డులను పరిశీలించి నిర్వహణలో పారదర్శకత ఉండాలని ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని సందర్శించి 10వ తరగతి విద్యార్థినుల విద్యా ప్రగతిని సమీక్షించారు. ఇటీవల జరిగిన పరీక్షల మార్కులను పరిశీలించి, తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థినులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. స్టడీ అవర్స్‌ను కచ్చితంగా అమలు చేయాలని, ప్రతి విద్యార్థిని వ్యక్తిగతంగా గమనించి అవసరమైన మార్గదర్శనం ఇవ్వాలని ఆదేశించారు. మంచి ఫలితాల కోసం క్రమబద్ధమైన చదువు, నియమిత పర్యవేక్షణ ఎంతో అవసరమని ఎంపీడీవో పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధికి అందిస్తున్న సదుపాయాలను పూర్తిగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, హాస్టల్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మున్సిపల్ సిబ్బందికి టిబి వ్యాధిపై అవగాహన



మన గళం డోన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నందు మున్సిపల్ సిబ్బందికి మరియు శానిటరీ వర్కర్స్ కి టీబీ వ్యాధిపై అవగాహన కల్పించి ఛాతి ఎక్సరే, గల్లా మరియు ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని తెలియజేసే అటువంటి స్పిరోమీటర్ పరీక్షల ద్వారా కొత్త క్షయ వ్యాధి రోగగ్రస్తులను కనుగొనుటకు స్క్రీనింగ్ చేయడమైనది. ఈ కార్యక్రమం ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ 2.0 భాగంగా 2030 సంవత్సరంతానికి భారతదేశంలో టీబీ వ్యాధి నిర్మూలనను చేయాలని సంకల్పంతో ప్రధాని నరేంద్ర మోడీ గారు ఈ కార్యక్రమానికి నాంది పలికారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డోన్ టీబీ యూనిట్, టీబీ అలర్ట్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ గారు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సల్మాకాతుమ్ గారు గారు , సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్స్ అరుణ్ కుమార్, కరీముల్లా సినియర్ ల్యాబ్ సూపర్వైజర్ ఉపేంద్ర యాదవ్, సూపర్వైజర్ వస్సూరు భాష, రోకలి బండ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఏఎన్ఎంలు, ఆశాలు ల్యాబ్ టెక్నీషియన్లు తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## దేశ సంపద పరిరక్షించాలి.. సీపీఐ



మన గళం బనగానపల్లె : దేశ సంపదను పరిరక్షించాలని బనగానపల్లె సిపిఐ పార్టీ మండల కార్యదర్శి శివయ్య శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బనగానపల్లె పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి సామాజిక న్యాయం కోరుతూ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టడం జరిగింది. సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు అంతం చేయాలని. కుల, మత, లింగ వివక్షతల నిర్మూలనకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలని, కార్పోరేట్ల సంపదపై పన్నులు విధించాలి,ఆ సంపదను ప్రజలకు పునః పంపిణి చేయలి అని,జన గణనలో కుల గణన చేపట్టాలి వాటి ఆధారంగా సామాజిక న్యాయం అందించాలని,దేశ రాజ్యాంగాన్ని పరిరక్షించాలనిలౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని,ప్రభుత్వ రంగ సంస్థలను,దేశ సహజ సంపద వనరులను కార్పోరేట్ లకు ధారాదత్తం చేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు సంజీవులు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎరి స్వామి ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దమనయ్య మాల మహానాడు సంఘం నాయకులు నాగరాజు సిపిఐ మండల సమితి సభ్యులు మతేష్ ఖాదర్, సుబ్రహ్మణ్యం ,రవి ,హోటల్ రాముడు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ



మనగళం శ్రీశైలం : చైత్రమాసంలో పౌర్ణమి తరువాత శ్రీ భ్రమరాంబా దేవి అమ్మ వారికి కుంభోత్సవం జరపడం సంప్రదాయం. ఈ సంవత్సరం ఏప్రిల్ 7న ఈ కుంభోత్సవం నిర్వహించ బడుతుంది. అమ్మవారికి సాత్త్వికబలి నిర్వహించేందుకు (కొబ్బరి కాయలు, గుమ్మడి కాయలు, నిమ్మకాయలు, మొదలగునవి సమర్పించడం) ఈ కుంభోత్సవం జరిపించడం ఆనవాయితీ. కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం.కాగా ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే ప్రతి మంగళవారం మరియు శుక్రవారం రోజులలో అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పించడం జరుగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం అనగా ఈ రోజున (20.02.2026)అమ్మ వారికి కొబ్బరి కాయలు సమర్పించ బడ్డాయి. ఈ కార్యక్రమంలో ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు,కుంకుమలతో వాటికి పూజాదికాలు జరిపించడం జరిగింది. తరువాత అమ్మవారికి ఈ కొబ్బరికాయలు సమర్పించబడ్డాయి.

## అన్న ప్రసాదవితరణ పథకానికి విరాళం



మనగళం శ్రీశైలం : శ్రీమతి ఎస్. మాధురి, హైదరాబాద్ వారు ఈ రోజు ( 20.02.2026) అన్నప్రసాదవితరణ పథకానికి విరాళం రూ. 1,00,116/-లను అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు యం. మల్లికార్జునకు అందజేయడం జరిగింది. దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి.

# సమాజ ఉన్నతికి శాస్త్ర పరిశోధనలే కీలకం

– జన విజ్ఞాన వేదిక





మన గళం డోన్ పట్టణంలోని కొత్తపేట ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ రామ నర్సప్ప అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు బి మాణిక్యం శెట్టి మాట్లాడుతూ సమాజ ఉన్నతికి శాస్త్ర పరిశోధనలు కీలకంగా మారుతాయి అన్నారు. 16వ శతాబ్దంలోని సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదించి సూర్యుని చుట్టూ భూమి తిరుగు తుందని చెప్పి ఆనాటి మతాధిపతుల చేతులలో మరణాన్ని పొందారన్నారు. బ్రూనో సత్యాన్వేషణలో సజీవ దహనం పొంది గొప్ప శాస్త్రవేత్తగా పేరు పొందాడని కొనియాడారు. ఆ తర్వాత కోపర్నికస్ గెలీలియో లాంటి వారు దాన్ని ఇంకా కొనసాగించి సూర్య కేంద్ర సిద్ధాంతం నిజమని నిరూపించారని అన్నారు. తరువాత రూమ్ నగరంలో 1889 లో బ్రూనో కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కావున శాస్త్రవేత్తల పరిశోధనలే దేశానికి కీలకమన్నారు.సైన్స్ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు చంద్రుడు, శ్రీనివాసులు, లోకనాథ్ రెడ్డి, లక్ష్మీదేవి, సువర్ణ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# అంకాళమ్మ వారికి విశేష పూజలు



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం శ్రీశైలక్షేత్ర గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మవారికి ఈ రోజు (20.02.2026) ఉదయం అభిషేకం, విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతీ శుక్రవారం రోజున శ్రీఅంకాళమ్మవారికి దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) ఈ విశేషపూజ జరిపించబడుతోంది. ఇందులో భాగంగా శ్రీఅంకాళమ్మవారికి అభిషేకం, విశేషఅర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించబడ్డాయి. కాగా శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రధాన ఆలయానికి ఎదురుగాగల రహదారికి చివరలో కుడివైపున ఉత్తరముఖంగా ఉంది. ప్రకృతి శక్తుల యొక్క కళలే గ్రామ దేవతలని దేవీభాగవతంలో చెప్పబడింది. కాగా ఈ ప్రకృతి అంతా ఆదిపరాశక్తి స్వరూపమేనని మన ఆర్షవాఙ్మయం చెబుతోంది. చతుర్భుజాలను కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి, సర్పంలో చుట్టబడిన డమరుకం ఉండగా, ఎడమవైపున పానపాత్ర, త్రిశూలం ఉన్నాయి. కిరీట మకుటం గల ఈ దేవి వస్త్రాలంకురాలై కర్ణాభరణాలను, కంఠాభరణాలను కలిగి ఉంటుంది. కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహా గణపతి పూజ జరిపించబడింది.ఆ తరువాత లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, జలముతో విశేషఅభిషేకం అర్చనలు నిర్వహించబడ్డాయి.

## శివాలయంలో విగ్రహా ప్రతిష్టాపన







నందవరం మండలం మన గళం న్యూస్ ఫిబ్రవరి 20తేదీ. : నందవరం మండల పరిధిలో కనకవీడు గ్రామం లో గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు వారి సమక్షంలో శుక్రవారం రోజున శివాలయం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం అత్యంత వైభవంగా, ఆగమ శాస్త్రోక్తంగా జరిగింది. ప్రాణ ప్రతిష్ట (ప్రాణ శక్తిని నింపడం) వాయు ప్రతిష్ట వంటి ముఖ్యమైన కర్మకాండల ద్వారా శివలింగానికి జీవకళ తీసుకువచ్చారు. ఈ కార్యక్రమం వల్ల దేవాలయం ఆధ్యాత్మిక శక్తితో అనుసంధానించబడి, భక్తుల కొంగుబంగారంగా మారుతుంది. యంత్ర స్థాపన ప్రాణప్రతిష్ట శ్రీశైలం గురువు శ్రీ మల్లికార్జున శాస్త్రి తో జరుగుతుందని పెద్దలు తెలిపారు. ఈ నేపథ్యంలో శు క్రవారం రోజునశ్రీ గణపతి, సుబ్రహ్మణ్యం, నందీశ్వర, శిఖర కలశ,నవగ్రహ, ధ్వజస్తంభ, శ్రీ అబిత కుల షాంబికసమేత శ్రీ అరుణాచలేశ్వర స్వామి విగ్రహ

ప్రతిష్టాపన కార్యక్రమం యొక్క ముఖ్య అంశాలు

శాస్త్రోక్త విధి విగ్రహ ప్రతిష్ట, మంత్రోచ్ఛారణల నడుమ ఆగమ శాస్త్రం ప్రకారం నిర్వహించారు.

ప్రాణ ప్రతిష్ట: విగ్రహంలోకి ప్రాణ శక్తిని ప్రవేశపెట్టే (ప్రాణ ప్రతిష్ట) ప్రక్రియతో మూర్తికి దైవత్వాన్ని తీసుకువచ్చారు.ప్రాముఖ్యత:శివాలయం లో లింగోద్భవ కాలంలో పూజలు చేయడం అత్యంత పవిత్రంగా జరిగింది.ఆలయ నిర్మాణం: శివాలయాల్లో సాధారణంగా శివుడితో పాటు, వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మరియు పార్వతీదేవి విగ్రహాలను కూడా ప్రతిష్టించారు.శివాలయం ప్రతిష్టతో స్థానికులు ఎంతో సంతోషాన్ని, ఆధ్యాత్మిక తృప్తిని వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు ఎంతో ఉత్సాహాలతో ప్రతి ఇంటి ఆడపడుచులకు విగ్రహ ప్రతిష్ట తర్వాత ఆదపడచులకు కుటుంబ వ్యక్తులు ఇవ్వాల్సినవి తాంబూలం: రెండు తమలపాకులు, రెండు వక్కలు పసుపు, కుంకుమ, మరియు పువ్వులు.వస్త్రాలు: (చీర, రవికె, లేదా పావడ) ఇవ్వడం చాలా మంచిదిని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజలు భక్తాదులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు హోలీ గిఫ్ట్: పెరగనున్న శాలరీలు?

న్యూఢిల్లీ ఫిబ్రవరి 20 , మనగళం : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు మరియు పెన్షనర్లకు 2026 హోలీ పండగ సందర్భంగా ప్రస్తుత డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ) పెంపుపై కేంద్రం ప్రకటన చేసే అవకాశం ఉంది. ప్రస్తుత ద్రవ్యోల్బణ గణాంకాల ప్రకారం డీఏ మరో 2 శాతం పెరుగుతూ 58 శాతం నుంచి 60 శాతం స్థాయికి చేరే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. సాధారణంగా ప్రభుత్వం ఏడాదికి రెండు సార్లు, జనవరి మరియు జూలై నెలల్లో డీఏ సవరణను చేస్తుంది. అయితే, పండగ సమయానికి అనుగుణంగా ఈసారి మార్చి మొదటి వారంలోనే ప్రభుత్వం ఆమోదం తెలపవచ్చని ఉద్యోగ సంఘాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం 7వ పే కమిషన్ గడువు 2025 డిసెంబరు 31న ముగిసిన తర్వాత 8వ పే కమిషన్ ఏర్పాటు ప్రక్రియ ఇంకా ప్రాథమిక దశలో ఉంది.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## రాజకీయాల్లో డబ్బు ప్రభావం ప్రమాదకరం?

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు శక్తి అత్యంత గొప్పది. ప్రజలే పాలకులను ఎన్నుకుంటారు. కానీ ఆ ప్రక్రియపై డబ్బు ప్రభావం పెరిగిన కొద్దీ ప్రజాస్వామ్య ఆత్మ దెబ్బతింటోందన్న ఆందోళన పెరుగుతోంది. ఎన్నికలు ప్రజా సేవకుల ఎంపికకు వేదిక కావాలి. అయితే అవి భారీ ఖర్చుల పోటీలుగా మారుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయాల్లో డబ్బు ప్రభావం ఎంత పెరిగితే ప్రజల నిర్ణయ స్వేచ్ఛ అంతగా సంకుచితమవుతుందనే ప్రశ్న ఇప్పుడు మరింత ప్రాసంగికమైంది.

ఎన్నికల సమయంలో ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రచార ర్యాలీలు, ప్రకటనలు, సామాజిక మాధ్యమాల ప్రచారం, ప్రచార వాహనాలు, కార్యాలయాలు ఇవి అన్నీ భారీ వ్యయంతో సాగుతున్నాయి. ఆర్థికంగా బలమైన అభ్యర్థులు మాత్రమే పోటీలో నిలబడగల పరిస్థితి ఏర్పడితే సామాన్యులకు రాజకీయాల్లో ప్రవేశం కష్టమవుతుంది. ఇది సమాన అవకాశాల సూత్రాన్ని దెబ్బతీస్తుంది. ప్రజాస్వామ్యం ధనికుల పోటీ వేదికగా మారే ప్రమాదం ఉంది.

డబ్బు ప్రభావం కేవలం ఎన్నికలకే పరిమితం కాదు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆర్థిక ప్రయోజనాల ప్రభావం పాలనపై కనిపించే అవకాశముంది. ఎన్నికల సమయంలో భారీగా ఖర్చు చేసినవారు ఆ వ్యయాన్ని తిరిగి పొందాలనే ప్రయత్నం చేస్తారన్న అభిప్రాయాలు ప్రజల్లో ఉన్నాయి. ఇది విధాన నిర్ణయాల్లో పారదర్శకతను దెబ్బతీస్తుంది. ప్రజా ప్రయోజనాల కంటే వ్యక్తిగత లేదా వర్గ ప్రయోజనాలు ముందుకు వచ్చే ప్రమాదం ఉంటుంది.

రాజకీయ పార్టీల నిధుల సేకరణపై స్పష్టత లేకపోవడం కూడా ఒక సమస్య. ఎవరు ఎంత విరాళం ఇస్తున్నారు? ఆ నిధులు ఎలా వినియోగిస్తున్నారు? అన్న విషయాల్లో పూర్తి పారదర్శకత అవసరం. లేకపోతే ఆర్థిక శక్తులు రాజకీయ నిర్ణయాలను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. ఇది ప్రజాస్వామ్య నైతికతకు ముప్పు.

సామాజిక మాధ్యమాల యుగంలో ప్రచారం మరింత ఖరీదైనదిగా మారింది. సమాచారం వేగంగా వ్యాపిస్తున్నప్పటికీ దాన్ని ప్రభావితం చేయడానికి పెద్ద ఎత్తున ఖర్చులు చేస్తున్నారు. ప్రచారంలో డబ్బు ఆధిపత్యం పెరిగితే ప్రజాభిప్రాయం కూడా దానికి లోనయ్యే ప్రమాదం ఉంది. నిజమైన అంశాల కంటే ప్రకటనల ప్రభావం ఎక్కువగా మారితే ప్రజాస్వామ్య చర్చ బలహీనపడుతుంది.

డబ్బు రాజకీయాల్లో పూర్తిగా తొలగించడం సాధ్యం కాకపోయినా, దాని ప్రభావాన్ని నియంత్రించడం సాధ్యం. ఎన్నికల ఖర్చులపై కఠిన నియంత్రణలు, పారదర్శక నిధుల వ్యవస్థ, స్వతంత్ర పర్యవేక్షణ వ్యవస్థలు అవసరం. ప్రజలు కూడా చైతన్యంతో వ్యవహరించాలి. డబ్బు ప్రలోభాలకు లోనుకాకుండా అభ్యర్థుల సామర్థ్యం, నైతికత, ప్రజా సేవా దృక్పథాన్ని ఆధారంగా తీసుకుని నిర్ణయం తీసుకోవాలి. రాజకీయాల్లో డబ్బు ప్రభావం పెరిగితే యువతలో రాజకీయాలపై నమ్మకం తగ్గే ప్రమాదం ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసం బలహీనపడితే అది దేశ భవిష్యత్తుకు హానికరం. ప్రజల నమ్మకమే ప్రజాస్వామ్యానికి మూలాధారం. ఆ నమ్మకాన్ని కాపాడటానికి రాజకీయ వ్యవస్థ స్వీయ సంస్కరణకు సిద్ధపడాలి. మొత్తంగా రాజకీయాల్లో డబ్బు ప్రభావం నియంత్రణలో లేకపోతే ప్రజాస్వామ్యానికి దీర్ఘకాలిక ముప్పు. సమాన అవకాశాలు, పారదర్శకత, నైతికత, ప్రజా బాధ్యత ఇవి బలపడితేనే ప్రజాస్వామ్యం ఆరోగ్యంగా ఉంటుంది. డబ్బు ఆధిపత్యం తగ్గి విలువల ఆధిపత్యం పెరిగితేనే ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడుతుంది. అదే సమాజం ఆశించే మార్గం. పారదర్శకత లేకపోవడం మరో సమస్య. పార్టీ నిధులు ఎలా సమకూరుతున్నాయి, ఎంత ఖర్చవుతోంది, ఎక్కడ ఖర్చవుతోంది అన్న అంశాలపై స్పష్టత లేకపోతే ప్రజల్లో అనుమానాలు పెరుగుతాయి. నిధుల సేకరణ, వినియోగం పై కఠిన నియంత్రణలు అవసరం. పారదర్శక వ్యవస్థల ద్వారా మాత్రమే ప్రజా నమ్మకం బలపడుతుంది.

సోషల్ మాధ్యమాలు, ప్రకటనల యుగంలో ప్రచార ఖర్చులు మరింత పెరిగాయి. సమాచార యుద్ధంలో ముందుండేందుకు భారీ వనరులు అవసరమవుతున్నాయి. దీని వల్ల రాజకీయ పోటీ సమాన స్థాయిలో జరగకపోవచ్చు. ఆర్థిక శక్తి ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే స్థితి ఏర్పడితే ప్రజాస్వామ్య విలువలు బలహీనపడే ప్రమాదం ఉంది.

అయితే డబ్బు పూర్తిగా రాజకీయాల నుంచి దూరం కావడం సాధ్యం కాదు. కానీ దాని ప్రభావాన్ని నియంత్రించవచ్చు. ఎన్నికల ఖర్చులపై కఠిన పరిమితులు, పారదర్శక నిధుల వ్యవస్థ, స్వతంత్ర పర్యవేక్షణ సంస్థలు వంటి చర్యలు అవసరం. ప్రజలు కూడా చైతన్యంతో ఓటు హక్కును వినియోగించాలి. డబ్బు ప్రలోభాలకు లోనుకాకుండా అభ్యర్థుల సామర్థ్యం, నైతికత ఆధారంగా నిర్ణయం తీసుకోవాలి. మొత్తంగా రాజకీయాల్లో డబ్బు ప్రభావం నియంత్రణలో లేకపోతే ప్రజాస్వామ్యానికి ముప్పు. సమాన అవకాశాలు, పారదర్శకత, నైతిక పాలన వంటి విలువలను కాపాడేందుకు సమిష్టి కృషి అవసరం. ప్రజాస్వామ్యం బలపడాలంటే ప్రజల విశ్వాసం నిలవాలి. ఆ విశ్వాసాన్ని కాపాడటం రాజకీయ వ్యవస్థ ముందున్న అతిపెద్ద బాధ్యత.

## అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలపై సిఐటియు రిలే నిరాహార దీక్ష




మన గళం కోడుమూరు: అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలపై సిఐటియు మండల అధ్యక్షులు జిపి వీరన్న మరియు ప్రాజెక్టు కార్యదర్శి సూలమ్మ లీడర్లు అరుణ హైమావతి రజియా ఆధ్వర్యంలో కోడుమూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ వరలక్ష్మికు వినతి పత్రం ఇవ్వడం జరిగింది . అంగన్వాడి సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల ఫిబ్రవరి 23 నుండి 27వ వరకుతేదీ ఐ సి డి ఎస్ ప్రాజెక్టు దగ్గర జరిగే రిలే నిరాహార దీక్షలు చేయాలని పిలుపునిచ్చింది అందులో భాగంగా కోడుమూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి టీచర్లందరూ హెల్పర్లు అందరూ ఈ నిరాహార దీక్షలో పాల్గొనాలని నాయకులు అన్నారు ప్రస్తుతం రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా అంగన్వాడీల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని గత ప్రభుత్వంలో 42 రోజులపాటు సమ్మె చేస్తే ప్రస్తుతమున్న ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉండగా మేము అధికారంలోకి వచ్చిన వెంటనే మీ సమస్యలను పరిష్కారం చేస్తామని దీక్ష శిబిరాల దగ్గరికి వచ్చి ముఖ్యమంత్రితో సహా ప్రస్తుతం మంత్రులందరూ హామీలు ఇవ్వడం జరిగింది . అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలుగా వస్తున్న అంగన్వాడీల సమస్యలపై ఎలాంటి స్పందన రాలేదు చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించలేక చాలా ఇబ్బందులు పడుతున్నారు పని భారం పెరిగింది రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ప్రతి సంక్షేమ పథకానికి అంగన్వాడీలు పనిచేస్తామన్నారు ఈరోజు గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ ప్రాంతాల్లో గర్భిణీలు చిన్నపిల్లలు వారి బాగోగులు చేస్తున్నవారు అంగన్వాడీలు. జీవో ప్రకారం 26 వేల రూపాయలు వేతనం ఇవ్వాలి కానీ ప్రభుత్వం అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు రిటర్మెంట్ బెనిఫిట్ అలాగే ప్రమోషన్లు కల్పించడంలో పూర్తిగా విఫలమైంది ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం జరుగుతున్నటువంటి బడ్జెట్ సమావేశాల్లో అంగన్వాడీల సమస్యలను అసెంబ్లీలో సంబంధిత మంత్రి గారు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము అలాగే ఈ నెల రెండవ తేదీన విజయవాడలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నాము అంగన్వాడీలందరూ పెద్ద ఎత్తున పాల్గోనాలని అన్నారు ఈ కార్యక్రమంలో రాఘవేంద్రమ్మ సుశీల మంజుల జానకి చంద్రమ్మ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## హరి-హర మహా క్షేత్ర దేవస్థానము సందర్శనకు వచ్చిన భారతీ అధికారులు




మన గళం కోడుమూరు; కర్నూలు జిల్లాలోని కోడుమూరు పట్టణంలో స్థానికంగా గల "హరి-హర మహా క్షేత్ర" శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానము కమిటీ సభ్యుల ఆహ్వానము మేరకు దేవస్థానము సందర్శనకు వచ్చిన భారతీ సిమెంట్ ఉన్నత అధికారులను దేవస్థానం కమిటీ సభ్యులు ఇక్కడ జరిగే ఉత్సవములకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయుట కొరకు 20 బ్యారికేడ్స్ ఇవ్వాలని కొరినే వెంటనే భారతి సిమెంట్స్ యాజమాన్యం వారు దేవస్థాన పునర్నిర్మాణమును సందర్శించి మహా అద్భుతమైనటువంటి దేవస్థానము యొక్క పునర్నిర్మాణమునకు మా వంతు సహకారంగా మేము భారీ కేడ్లను కచ్చితంగా దేవస్థానం వారికి అందజేస్తామని దేవస్థాన సందర్శనకు వచ్చినటువంటి భారతీ సిమెంట్స్ అంతర్రాష్ట్ర అధికారి మల్లారెడ్డి డిసెంబర్ 2025 లో దేవస్థానం కమిటీ సభ్యుల కోరిక మేరకు అందజేస్తానని మాట ఇవ్వడం జరిగినది. ఆరోజు ఇచ్చిన మాటను కేవలం అతి తక్కువ అయిన 60 రోజులలోనే ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రూపాయల విలువ చేయు 20 భారీ కేడ్లను ను భారతి సిమెంట్స్ అధికారి మల్లారెడ్డి సూచనల మేరకు కర్నూలు జిల్లా అధికారి అయిన ఇక్బాల్ భాషా మరియు టెక్నికల్ ఆఫీసర్ అయిన ఉదయ్ చేతుల మీదుగా ఫిబ్రవరి 20వ తేదీన హరి-హర మహా క్షేత్ర శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానము ఆలయ ధర్మకర్త మరియు చైర్మన్ ఎద్దుల మహేశ్వర రెడ్డి గారికి మరియు దేవస్థానం కమిటీ సబ్యుల ఆధ్వర్యంలో అందజేయడం జరిగినది.. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాజశేఖర్, దామోదర్, వెంకటస్వామి,విజయ్,కిషోర్, గంగాధర్ పాల్గొనడము జరిగినది

## మురికినీటి మయంగా కోట్ల విజయభాస్కర్ రెడ్డి నగర్ పట్టించుకోని గ్రామపంచాయతీ

**తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే కాలనీ ప్రజలతో కలిసి ఆందోళన చేపడతాం సిపిఐ రాజు**





మన గళం కోడుమూరు: కోడుమూరు పట్టణంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి నగర్ కాలనీలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న మురికినీటి నిల్వల సమస్యపై సిపిఐ నాయకులు రాజు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న ఈ సమస్య కారణంగా భారీగా మురుగు నీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోందని ఆయన పేర్కొన్నారు.కాలనీలో సిసి రోడ్లు, శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ, ఎంపీడీవో, ఈవోఆర్డి, గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు వినతి పత్రాల ద్వారా సమస్య తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేదన్నారు. అధికారులు నిధులు లేవంటూ కాలనీ సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారులు స్వయంగా కాలనీని సందర్శించి ఇక్కడి పరిస్థితులను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని, లేదంటే కాలనీ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతాం" అని రాజు స్పష్టం చేశారు. మురికినీటి నిల్వల వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారని, పాములు, తేళ్లు సంచరించడం ఎక్కువై ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. నిరుపేదల కాలనీ అయిన కోట్ల విజయభాస్కర్ రెడ్డి నగర్‌లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు కాలనీ ప్రజల ఆవేదనను అర్థం చేసుకుని వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలని సిపిఐ నాయకులు అధికారులను కోరారు ఇప్పటికైనా కాలనీ వాసులను అనారోగ్య బాధల నుంచి విముక్తి చేయాలని వారు ఈ సందర్భంగా అధికారులకు తెలియజేశారు.

## కోడుమూరులోని అక్రమ కట్టడాలపై విచారించిన ఆర్డీవో సందీప్ కుమార్







మన గళం కోడుమూరు; కోడుమూరు పట్టణంలోని 103 సర్వే నంబరు లో వున్న అక్రమ కట్టడాలపై విచారించిన కర్నూలు ఆర్ డి ఓ సందీప్ కుమార్. ఆర్ డి ఓ విచారణలో బయటపడ్డ అక్రమ కట్టడాలు. ఈ సర్వే నంబరు లో హోటళ్లు, షాప్ లు, వాహన షెడ్ లు, ప్రైవేట్ ఆసుపత్రి కట్టడాలు ఉన్నట్లు గుర్తించిన రెవెన్యూ అధికారులు. ఈ అక్రమ కట్టడాలు అన్ని కూడా కోడుమూరు లో వున్న ప్రముఖ రాజకీయ నాయకులు కావడం గమనార్హం. కొంతమంది ఈ అక్రమ కట్టడాల్లో హోటళ్లు వేసి ప్రతి నెలా అద్దెలు వసూలు చేసుకోవడం విశేషం. మరి కోడుమూరు గ్రామ పంచాయతీ అక్రమ కట్టడాలకు ఎందుకు అనుమతులు ఇస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

# ఓన్సోర్స్ రెవెన్యూ “అనే అంశం మీద శిక్షణ కార్యక్రమం

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు అందరికీ అదే విధంగా డిజిటల్ అసిస్టెంట్స్ అందరికీ కూడా ఒక రోజు ఓరియెంటేషన్ కార్యక్రమము గ్రామపంచాయతీలలో“ సొంత వనరుల సమకూర్చడం “అనే అంశం మీద “ఓన్సోర్స్ రెవెన్యూ “అనే అంశం మీద శిక్షణ కార్యక్రమం ఈరోజు నిర్వహించారు ఆ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రతి పంచాయతీ కార్యదర్శి ప్రతి డిజిటల్ అసిస్టెంట్ కూడా వారి వారి గ్రామపంచాయతీలో వారి పంచాయితీని పరిపాలించుకోవడానికి వారే వారి యొక్క పంచాయతీలో ఉన్నటువంటి ప్రజల ద్వారా ఇంటి పనులు అదేవిధంగా నాన్ టాక్సిస్ వసూలు చేసుకునే దానికి అదే విధంగా గ్రామపంచాయతీకి వనరులను సమకూర్చుకునేటువంటి విధానంపై ప్రభుత్వ ఆదేశాల మేరకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది కాబట్టి ఈ శిక్షణను ఇవ్వడానికి రిసోర్స్ పర్సన్స్గా ఎంపీడీవో డిప్యూటీ మరియు ఎంపీడీవో ఆఫీస్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అదేవిధంగా పంచాయతీ కార్యదర్శిలు కే సుంకన్న ఆమడగుంట్ల స్వప్నకుమారి అనుకొండ వారు కూడా రిసోర్స్ పర్సన్ గా పని చేశారు ఈ సందర్భంగా వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.ఖ




# సామాజిక న్యాయం కోరుతూ అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమం సిపిఐ

మన గళం కోడుమూరు: అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి.20 వ తేదీ శుక్రవారం. స్థానిక కోడుమూరు పట్టణ సామాజిక న్యాయం కోరుతూ. సీపీఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి బి రాజు మాట్లాడుతూ. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న వంటి ప్రజా వ్యతిరేక విధానాలపైన పోరాటాలు కొనసాగించాలని సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు అంతం చేయాలి. కుల, మత, లింగ వివక్షతల నిర్మూలనకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలి అని వారు డిమాండ్ చేశారు అలాగే కార్పోరేట్ల సంపదపై పన్నులు విధించాలి. ఆ సంపదను ప్రజలకు పునః పంపిణి చేయాలి. జన గణనలో కుల గణన చేపట్టాలి.వాటి ఆధారంగా సామాజిక న్యాయం అందించాలి దేశ రాజ్యాంగాన్ని పరిరక్షించాలి. లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. ప్రభుత్వ రంగ సంస్థలను, దేశ సహజ సంపద వనరులను కార్పోరేట్ లకు ధారాదత్తం చేయడం మానుకోవాలి.దేశ సంపదను పరిరక్షించాలి. అవసరం బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి మధు ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి మహిళా సమైక్య జిల్లా నాయకులు సులోచనమ్మ. ఏఐటీయూసీ అనుబంధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు




# జివిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ సంబరాలు

మన గళం కోడుమూరు: జివిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఈరోజు పాఠశాల నందు వార్షికోత్సవ సంబరాలు జరిగాయి పాఠశాల దినోత్సవం లో ప్రధానోపాధ్యాయుడు జె . రామ చంద్రుడు మాట్లాడుతూ ఈ పాఠశాల 1946 సంవత్సరంలో పూరి గుడిసె లలో ప్రారంభించ బడి, స్థల దాత గుంత కంటి వెంకటరెడ్డి ఇచ్చిన 10 ఎకరముల స్థలంలో ప్రారంభించి నాటి నుండి దిన దినదినాభివృద్ధి చెందుతూ ఎంతోమంది బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత స్థాయి పదవులు, అయిన ఐఏఎస్ ఆఫీసర్స్, ఐపీఎస్ ఆఫీసర్స్ ,డాక్టర్స్ ఇంజనీర్స్ ,ఆర్థికవేత్తలు, రాజకీయంగా ఉన్నత స్థానాలను చేరుకున్న పాఠశాలలో మీరు విద్యను, అభ్యసించడం మీ అదృష్టము గా భావించాలి. నాడు పాఠశాలలో కనీస వసతులు లేని రోజులు ఈ పాఠశాల విద్యార్థులు కష్టపడి ఇష్టంతో అంకితభావంతో చదువుకోవడం ద్వారానే వారు భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకున్నారు. నేడు మన పాఠశాల ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకం నిధులతో నడపబడుచున్నది. ఈ పాఠశాల యందు 26 విశాలమైన తరగతి గదులలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ద్వారా విద్యా బోధన జరుగుతున్నది. అనుభవజ్ఞులైన ప్రతి సబ్జెక్టు నందు నలుగురు ఉపాధ్యాయుల ద్వారా విద్యా బోధన చేయ బడుతున్నది. సైన్స్ ప్రయోగశాల, డిజిటల్ లైబ్రరీ, ఐటీ, బ్యాంకింగ్, ఎలక్ట్రానిక్స్ ఒకేషనల్ కోర్సు ద్వారా విద్య అందించ బడుతున్నది. మధ్యాహ్న భోజన పథకం తల్లికి వందనం వంటి పథకాల ద్వారా విద్యార్థులకు చేయూత నందిస్తూ ముందుకు సాగుతున్న మన పాఠశాల యందు ప్రస్తుతము 640 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. నేటి కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక, జానపద నృత్యాలతో, అభినయాలతో, కార్యక్రమాలతో ఆకొట్టు కోవడం జరిగిందన్నారు నేటి కార్యక్రమం నందు విద్యార్థులు ,ఉపాధ్యాయులు ఉల్లాసంగా ఉత్సాహంగా పాలుపంచుకోవడం ఎంతో ఆనందాయకమని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక అధ్యాపకుల బృందము మరియు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు




# గ్రామ సచివాలయంలో హౌసింగ్ లబ్ధిదారులతో అవగాహన కార్యక్రమం

మన గళం కోడుమూరు; కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ప్యాలకుర్తి గ్రామం నందు మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీ వెంకటరాముడు డిఎం సివిల్ సప్లై ఆఫీసర్ అదేవిధంగా డిప్యూటీ ఇంజనీర్ లాల్ కృష్ణ హౌసింగ్, ఎంపీడీవో, వర్క్ ఇన్స్పెక్టర్సు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులు అందరు కూడా ప్యాలకుర్తి గ్రామపంచాయతీలో గ్రామ సచివాలయంలో హౌసింగ్ లబ్ధిదారులతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి ఇంతవరకు కట్టుకున్నటువంటి ఇళ్లను మిగతా స్టేజెస్ కూడా కన్వర్ట్ చేసి ఇళ్ల నిర్మాణము త్వరగా ఉగాది లోపు పూర్తి చేసుకోవాలని హెచ్చరిస్తూ ఉగాది లోపు ఇల్లు కట్టుకోకపోతే క్యాన్సల్ అవుతాయని ఇంతవరకు ప్రభుత్వం వారు ఇచ్చినటువంటి డబ్బులు కూడా వెన్నుకి కట్టాల్సి వస్తుందని అదేవిధంగా ప్రభుత్వం ఇచ్చేటువంటి సహాయాన్ని తీసుకొని ఇల్లు పూర్తి చేసుకొని ఉగాదిలోపు కంప్లీట్ చేసుకున్నవారు గృహప్రవేశాలు కూడా ఉగాది రోజు ప్రభుత్వం ఆదేశాల మేరకు చేయబడతాయని గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఈ అవకాశాన్ని కచ్చితంగా ఉపయోగించుకోవాలని అధికారులు లబ్ధిదారులకు తెలియజేశారు.



# మార్కెట్లకు లాభాల కళ..




హైదరాబాద్ ఫిబ్రవరి 20, 2026, మన గళం : దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిసాయి. పీఎస్‌యూ బ్యాంకులు, మెటల్ రంగ షేర్లలో బలమైన కొనుగోళ్లు జరగడం వలన సూచీలు రాణించాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 316 పాయింట్లు లాభపడి 82,814 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 116 పాయింట్లు పెరిగి 25,571 వద్ద ముగిసింది. రంగాల వారీగా చూస్తే ఐటీ, మీడియా మినహా మిగిలినవన్నీ లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ ఐటీ సూచీ 0.98 శాతం నష్టపోయగా, పీఎస్‌యూ బ్యాంకింగ్ సూచీ 1.68 శాతం, మెటల్ సూచీ 1.25 శాతం చొప్పున లాభపడ్డాయి. పవర్, క్యాపిటల్ గూడ్స్, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో కూడా కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. అయితే, మార్కెట్ బ్రెడ్త్ ప్రతికూలంగా ఉండి, 2,043 షేర్లు లాభపడగా 2,511 షేర్లు నష్టాల్లో ముగిశాయి. రోజు ప్రారంభంలో ఒడుదొడుకులకు లోనైనప్పటికీ, తక్కువ స్థాయిల వద్ద నాణ్యమైన షేర్లను కొనుగోలు చేసేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడం వలన మార్కెట్లు పుంజుకున్నాయని విశ్లేషకులు తెలిపారు. అమెరికా-ఇరాన్ మధ్య భౌగోళిక ఉద్రిక్తతలు, మిశ్రమ అంతర్జాతీయ సంకేతాల కారణంగా సమీప భవిష్యత్తులో మార్కెట్ కొంత రేంజ్-బౌండ్‌లోనే ఉండవచ్చని వారు అంచనా వేస్తున్నారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.02 శాతం బలపడి 90.99 వద్ద ముగిసింది. బ్యాంక్ నిఫ్టీ కీలకమైన 61,200 స్థాయి పైన ముగియడం సానుకూల సంకేతమని, 61,000 స్థాయి కీలక మద్దతుగా, 61,350-61,400 స్థాయి తక్షణ నిరోధకంగా పనిచేయవచ్చని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడ్డారు.

# మళ్లీ పెరిగిన బంగారం, వెండి ధరలు



హైదరాబాద్ ఫిబ్రవరి 20, మన గళం : అమెరికా మరియు ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంతో శుక్రవారం భారతదేశంలో బంగారం, వెండి ధరల్లో మళ్లీ పెరుగుదల నమోదు అయింది. అంతర్జాతీయ మార్కెట్లు ప్రభావితమవుతూనే, ఇండియాలో కూడా పెరుగుదల కనిపించింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఎమ్‌సీఎక్స్‌లో 10 గ్రాముల గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ. 1,53,000 మార్క్ వద్ద నిలిచినట్లు నమోదు అయ్యింది. సిల్వర్ ఫ్యూచర్స్ ధర కూడా స్వల్పంగా పెరిగి రూ. 2,43,000కు చేరింది. అంతర్జాతీయంగా ఔన్స్ బంగారం స్పాట్ ధర 5,010 డాలర్ల వద్ద కొనసాగుతోంది. అయితే, డాలర్ బలంగా ఉండటం వల్ల లోహాల ధరల పెరుగుదల మధ్యస్థాయి పరిమితిలోనే ఉంది అని మార్కెట్ వర్గాలు చెబుతున్నారు. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ బంగారం ధర ప్రస్తుతం రూ. 1,56,170, 22 క్యారెట్ బంగారం ధర రూ. 1,43,150గా ఉంది. కిలో వెండి ధర రూ. 2.7 లక్షల వద్ద కొనసాగుతోంది. చెన్నైలో 24 క్యారెట్ బంగారం ధర రూ. 1,57,310గా, ముంబైలో రూ. 1,56,170గా నమోదయ్యింది. ఈ రెండు నగరాల్లో వెండి రేట్లు కూడా రూ. 2.7 లక్షల వద్ద నిలిచాయి. ఈ సమాచారం పాఠకులకు అవగాహన కోసం మాత్రమే ఇవ్వబడింది; బంగారం, వెండి ధరలు పరిస్థితులకు అనుగుణంగా మారుతూనే ఉంటాయి.

# స్విగ్గీ ‘స్నాక్’ 10 నిమిషాల డెలివరీ ఎందుకు విఫలమైంది

హైదరాబాద్ ఫిబ్రవరి 20, 2026, మన గళం : భారతదేశంలో క్విక్ కామర్స్ రంగంలో వేగంగా పెరుగుతున్న డిమాండ్ మధ్య, ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ 10 నుంచి 15 నిమిషాల్లో స్నాక్స్, పానీయాలను డెలివరీ చేయించే ‘స్నాక్’ యాప్‌ను ఆర్భాటంగా ప్రారంభించింది. అయితే, 2025 జనవరిలో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ 15 నెలల్లోనూ ఆర్థికంగా నిలదొక్కుకోలేక, కంపెనీ అధికారికంగా దీన్ని మూసివేసింది. స్విగ్గీ సాధారణ యాప్‌లో ఫుడ్ ఆర్డర్ చేస్తే రెస్టారెంట్‌లో తయారవ్వడానికి 30 నుండి 40 నిమిషాలు పడుతుందే, ‘స్నాక్’ యాప్‌లో రెడీ-టు-ఈట్ పదార్థాలను ఎంపిక చేసిన ప్రాంతాల్లో సొంత హబ్‌లలో నిల్వ చేసి, ఆర్డర్ వచ్చిన వెంటనే డెలివరీ చేయడం జరుగుతుండేది. బెంగళూరు, గురుగ్రామ్, నోయిడా వంటి నగరాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభమైనా, నిర్వహణ ఖర్చులు, రైడర్ల లభ్యత, ఆహార పదార్థాల వృథా వంటి సమస్యల వల్ల లాభాలు రావడంలో విఫలమైంది. కస్టమర్లు అత్యవసరంగా కిరాణా సామాగ్రి మాత్రమే కోరడంలో, 10 నిమిషాల వేగవంతమైన స్నాక్ డెలివరీకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వలేదు. 2026 మూడో త్రైమాసికంలో స్విగ్గీ నికర నష్టంగా రూ. 1,065 కోట్లను నమోదు చేసింది. ఆదాయం 54 శాతం పెరిగినప్పటికీ, ఖర్చులు కూడా భారీగా పెరగడం, ఇన్వెస్టర్ల ఒత్తిడి కంపెనీని ప్రధాన ఫుడ్ డెలివరీ వ్యాపారంపై దృష్టి పెట్టమని నిర్ణయం తీసుకోవడంలో ప్రధాన కారణమైంది.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక




## తమిళంలో విలన్‌గా సుహాస్ ఎంట్రీ

చెన్నై ఫిబ్రవరి 20, మన గళం : తెలుగులో హీరోగా వరుస విజయాలతో ముందుకు సాగుతున్న సుహాస్ తన సినీ ప్రయాణంలో మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. తమిళ నటుడు సూరి కథానాయకుడిగా నటిస్తున్న మండాడి చిత్రంలో సుహాస్ ప్రధాన ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. సముద్రం నేపథ్యంగా సాగే శక్తివంతమైన యాక్షన్ నాటకంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఇప్పటివరకు ఎక్కువగా పక్కా మధ్యతరగతి యువకుడి పాత్రల్లో, హాస్యంతో పాటు భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న కథల్లో కనిపించిన సుహాస్, ఈసారి పూర్తి భిన్నంగా ప్రతినాయక ఛాయలతో కూడిన పాత్రను ఎంచుకోవడం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కథలో అతని పాత్ర బలమైన ప్రతిబంధకంగా నిలుస్తుందని, కథానాయకుడితో ఎదురెదురుగా సాగే ఘర్షణ సన్నివేశాలు చిత్రానికి ప్రధాన ఆకర్షణగా ఉంటాయని సమాచారం. సుమారు డెబ్బై ఐదు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మితమవుతున్న ఈ చిత్రానికి మతిమారన్ పుహళేంది దర్శకత్వం వహిస్తున్నారు. సాంకేతికంగా ఉన్నత ప్రమాణాలతో, విస్తృత స్థాయిలో తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. ఈ ఏడాది వేసవి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. తెలుగులో హీరోగా తనదైన గుర్తింపు సంపాదించిన సుహాస్, తమిళంలో ప్రతినాయకుడిగా ఎలా మెప్పిస్తాడన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రం ఆయనకు దక్షిణ భారత చిత్రసీమలో కొత్త మార్గాలు తెరుస్తుందా అన్నది విడుదల తర్వాత తేలనుంది.



## నాకు కూడా ప్రేమలో పడాలని ఉంది: ప్రభాస్

హైదరాబాద్ ఫిబ్రవరి 20 ,మన గళం : రెబల్ స్టార్ ప్రభాస్ వ్యక్తిగత జీవితంపై ఇప్పటివరకు ఎక్కువగా మాట్లాడని ఆయన, తాజాగా ప్రేమపై తన మనసులోని భావాలను బయటపెట్టి అభిమానులను ఆశ్చర్యానికి గురి చేశారు. పెళ్లి విషయంపై గతంలో ఎన్నోసార్లు ప్రశ్నలు ఎదురైనా నవ్వుతోనే దాటవేసిన ప్రభాస్, ఇప్పుడు మాత్రం "నాకు కూడా ప్రేమలో పడాలని ఉంది" అంటూ ఓపెన్‌గా చెప్పడం చర్చనీయాంశంగా మారింది. అనుష్క నుంచి కృతి సనన్ వరకు పలువురితో ఆయన పేరు అనుసంధానమైనప్పటికీ, వాటిపై ఎప్పుడూ స్పష్టంగా స్పందించలేదు. అయితే ఈసారి మాత్రం తన మనసులోని కోరికను స్పష్టం చేశారు. టాలీవుడ్‌లో తాజాగా విడుదలైన కపుల్ ఫ్రెండ్లీ చిత్రం మంచి స్పందన తెచ్చుకుంటున్న నేపథ్యంలో ఆ చిత్ర బృందంతో ప్రభాస్ ప్రత్యేకంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా హీరోయిన్ మానస వారణాసి ప్రేమపై మీ అభిప్రాయం ఏమిటని ప్రశ్నించగా, ప్రభాస్ తొలుత సిగ్గుపడుతూ స్పందించారు. "ఇది వ్యక్తిగత ప్రశ్న కదా" అంటూ చిరునవ్వుతో మొదలుపెట్టి, "నిజం చెప్పాలంటే నాకు కూడా ప్రేమలో పడాలని ఉంది. ఆ అద్భుతమైన అనుభూతిని ఆస్వాదించాలని ఉంది. ఆ క్షణం కోసం నేనూ ఆతృతగా ఎదురుచూస్తున్నాను" అని చెప్పడం విశేషం. ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఇక సినిమాల విషయానికొస్తే ప్రభాస్ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. సలార్ 2, స్పిరిట్, ఫౌజీ, కల్కి 2 వంటి భారీ చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. వ్యక్తిగత జీవితంపై చేసిన ఈ వ్యాఖ్యలతో పాటు, ఆయన తదుపరి చిత్రాలపై కూడా అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది.



## బాలీవుడ్‌పైనే ఎక్కువ దృష్టి పెట్టిన తాప్సీ..

హైదరాబాద్ ఫిబ్రవరి 19, మన గళం : తెలుగులో తక్కువ సినిమాలే చేసినప్పటికీ స్టార్ హీరోల సరసన నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి తాప్సీ పన్ను ప్రస్తుతం పూర్తిగా హిందీ చిత్రసీమపైనే దృష్టి కేంద్రీకరించినట్లు కనిపిస్తోంది. ఒకప్పుడు టాలీవుడ్‌లో క్రేజీ హీరోయిన్‌గా గుర్తింపు పొందిన ఆమె, వరుస విజయాలతో మంచి పేరు సంపాదించింది. కెరీర్ మంచి దశలో ఉన్నప్పుడే బాలీవుడ్ వైపు అడుగులు వేసిన తాప్సీ, అక్కడ కూడా తక్కువ సమయంలోనే తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకుంది. కమర్షియల్ చిత్రాలతో పాటు మహిళా ప్రధాన కథల్లో నటిస్తూ తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. తెలుగులో రవితేజ, ప్రభాస్ వంటి స్టార్ హీరోలతో కలిసి నటించి గుర్తింపు పొందిన తాప్సీ, ఆ తరువాత హిందీ చిత్రాల్లో వరుస అవకాశాలు అందుకుంది. అక్కడ మహిళా ప్రధాన పాత్రలతో ప్రత్యేక ముద్ర వేసుకుని, ఫైర్‌బ్రాండ్ ఇమేజ్‌ను సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఆమె ఎక్కువగా హిందీ చిత్రాలకే ప్రాధాన్యత ఇస్తుండటంతో తెలుగులో కనిపించి చాలా కాలం అయ్యింది. ఇటీవల తనకు ఇంకా జీవితంలో ఎన్నో అనుభవాలు ఆస్వాదించాలని ఉందని చేసిన వ్యాఖ్యలు అభిమానుల్లో చర్చకు దారితీశాయి. తెలుగు ప్రేక్షకులకు ఒకప్పుడు సుపరిచితమైన ఈ క్రేజీ హీరోయిన్ మళ్లీ టాలీవుడ్‌లో కనిపిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.



## నాలాంటి వాళ్లు ఇండస్ట్రీలో చాలా మంది ఉన్నారు.. పూజా హెగ్డే

హైదరాబాద్ ఫిబ్రవరి 20 , మన గళం : అందాల బుట్టబొమ్మగా గుర్తింపు పొందిన పూజా హెగ్డే గత కొంతకాలంగా వరుస సినిమాల్లో నటిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో విజయాలు మాత్రం అందుకోలేకపోతున్నారు. టాలీవుడ్‌లో అగ్ర హీరోలైన అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్, మహేష్ బాబు, ప్రభాస్, రామ్ చరణ్, పవన్ కళ్యాణ్ తదితరులతో స్క్రీన్ షేర్ చేసుకున్న ఆమెకు ఇప్పుడు తెలుగులో అవకాశాలు తగ్గినట్లుగా కనిపిస్తోంది. గత కొన్నేళ్లుగా ఒక్క తెలుగు సినిమాలో కూడా కనిపించని పూజా, ఇటీవల సూర్య హీరోగా నటించిన రెట్రో చిత్రంలో హీరోయిన్‌గా నటించారు. అయితే భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను ఆశించినంతగా ఆకట్టుకోలేకపోయింది. అంతకుముందు ఆమె నటించిన రాధేశ్యామ్, బీస్ట్, ఆచార్య, సిర్కస్, కిసీ కా భాయ్ కిసీ కి జాన్, దేవా వంటి చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. వరుసగా ఫ్లాప్‌లు ఎదురైనా ఆమెకు అవకాశాలు మాత్రం వస్తూనే ఉండటం గమనార్హం.

ప్రస్తుతం విజయ్ హీరోగా తెరకెక్కుతున్న జననాయగన్ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు. అయితే ఈ సినిమా విడుదలపై ఇంకా స్పష్టత రాలేదు.

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన పూజా హెగ్డే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ మధ్య కాలంలో నేను చేసిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశపరుస్తున్నాయి. కొంతకాలంగా నా జీవితంలో 'విజయం' అనే పదానికి అర్థం మారిపోయింది. కానీ ఈ దశ కూడా నాకు చాలా ముఖ్యమైనది," అని తెలిపారు.

అలాగే, "భవిష్యత్తులో నేను చేసే సినిమాలు నేను ఎలాంటి నటిని అనేది ప్రేక్షకులకు చూపిస్తాయి. సినీ బ్యాగ్రౌండ్ నుంచి వచ్చిన నాలాంటి వాళ్లు ఇండస్ట్రీలో చాలా మంది ఉన్నారు. వాళ్లు ఎన్నో సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుంది. నేను ఈ స్థాయిలో ఉన్నా కూడా ఇంకా సాధించాల్సింది చాలా ఉంది. ప్రతి ఒక్కరి జీవితంలో హెచ్చుతగ్గులు ఉంటాయి. మేము నటులం కాబట్టి ఫ్లాప్‌లను కూడా స్వీకరించాలి," అంటూ ఆమె స్పష్టం చేశారు. పూజా హెగ్డే మళ్లీ విజయాల బాట పట్టాలనే ఆశతో ఆమె అభిమానులు ఎదురుచూస్తున్నారు.



## 'టాక్సిక్' టీజర్ వచ్చేసింది

హైదరాబాద్ ఫిబ్రవరి 20, మన గళం : రాకింగ్ స్టార్ యశ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'టాక్సిక్' టీజర్ విడుదలై సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టిస్తోంది. 'కేజీఎఫ్' చిత్రాల తర్వాత యశ్ నటిస్తున్న సినిమా కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా వచ్చిన టీజర్ ఆ అంచనాలను మరింత పెంచింది. సుమారు ఒక నిమిషం యాభై ఐదు సెకన్ల నిడివి గల ఈ టీజర్ మొత్తం యాక్షన్ సన్నివేశాలతో నిండిపోయింది. భారీ విధ్వంసం, తీవ్ర హింసాత్మక దృశ్యాలు, రఫ్ అండ్ రగ్డ్ లుక్‌తో యశ్ 'రాయ' అనే డార్క్ పాత్రలో కనిపిస్తూ శక్తివంతమైన తెర ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. "అందరితో విరోధం పెట్టుకొని బతకలేవుడ పట్టుదల వదిలేయ్" అనే సంభాషణ టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

టీజర్ విడుదలైన వెంటనే హ్యాష్‌ట్యాగ్ యశ్ పదొమ్మిదో చిత్రం సామాజిక మాధ్యమాల్లో ప్రముఖంగా మారింది. దృశ్య మాధ్యమ వేదికల్లో ఈ వీడియో వేగంగా వీక్షణలు సాధిస్తోంది. రెట్రో శైలిలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. కథా రూపకల్పనలో యశ్ కూడా భాగస్వామ్యం అయ్యారు.

కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ పతాకాలపై వెంకట్ కె. నారాయణ, యశ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం దేశవ్యాప్తంగా, అంతర్జాతీయ స్థాయిలో ఒకేసారి విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. 'కేజీఎఫ్' తర్వాత మరోసారి తన భీకర రూపంతో ప్రేక్షకులను అలరించేందుకు యశ్ సిద్ధమవుతున్నారని అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# టీ20 ప్రపంచ కప్: చావో రేవో! రసవత్తరంగా మారనున్న సూపర్




హైదరాబాద్ ఫిబ్రవరి 20 , మన గళం : టీ20 ప్రపంచ కప్ 2026 గ్రూప్ దశ ముగింపు దశకు చేరుకోగా సూపర్ 8 సమరానికి రంగం సిద్ధమైంది. ఎనిమిది జట్లు తదుపరి దశకు అర్హత సాధించగా మొదటి గ్రూప్‌లో భారత జాతీయ క్రికెట్ జట్టు, దక్షిణాఫ్రికా జాతీయ క్రికెట్ జట్టు, వెస్టిండీస్ క్రికెట్ జట్టు, జింబాబ్వే జాతీయ క్రికెట్ జట్టు చోటు దక్కించుకున్నాయి. రెండో గ్రూప్‌లో పాకిస్థాన్ జాతీయ క్రికెట్ జట్టు, ఇంగ్లాండ్ క్రికెట్ జట్టు, శ్రీలంక జాతీయ క్రికెట్ జట్టు, న్యూజిలాండ్ జాతీయ క్రికెట్ జట్టు నిలిచాయి. ప్రస్తుతం అందరి దృష్టి జింబాబ్వేపైనే నిలిచింది. బలమైన జట్లతో కూడిన గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలవడం మాత్రమే కాకుండా ఆస్ట్రేలియాను టోర్నీ నుంచి తప్పించడంలో కీలక పాత్ర పోషించడం సంచలనంగా మారింది. ఆస్ట్రేలియాపై సాధించిన విజయం యాదృచ్ఛికం కాదని నిరూపిస్తూ చివరి లీగ్ పోటీలో శ్రీలంకనూ ఓడించి అజేయంగా ముందుకు సాగింది. మొదటి గ్రూప్‌లోని నాలుగు జట్లు గ్రూప్ దశలో ఒక్క పరాజయం కూడా చవిచూడకపోవడంతో ఈ దశలో ప్రతి పోటీ తుదిపోరులా ఉత్కంఠభరితంగా మారనుంది. గత ప్రపంచ కప్ తుదిపోరులో భారత్‌కు గట్టి సవాల్ విసిరిన దక్షిణాఫ్రికా ఈసారి మరింత ప్రతీకార దాహంతో బరిలోకి దిగుతోంది. అలాగే గతంలో కప్‌ను కైవసం చేసుకున్న వెస్టిండీస్ జట్టును ఏమాత్రం తక్కువగా అంచనా వేయలేం. అంచనాలు లేకుండా బరిలోకి దిగి సంచలన ప్రదర్శన చేయగల సామర్థ్యం ఆ జట్టుకు ఉంది. మరోవైపు రెండో గ్రూప్‌లోని ప్రతి జట్టు గ్రూప్ దశలో ఒక్కో పరాజయం చవిచూసింది కాబట్టి అక్కడ కూడా పోటీ తీవ్రంగా ఉండనుంది. ప్రతి మ్యాచ్ ఉత్కంఠను రెట్టింపు చేస్తుండగా జింబాబ్వే సంచలన ప్రయాణం ఇక్కడితో ఆగుతుందా లేక మరింత చరిత్ర సృష్టిస్తుందా అన్నది ఇప్పుడు క్రికెట్ అభిమానుల ఆసక్తిగా మారింది.

# సూపర్-8 ఫార్మాట్ విషయంలో ఐసీసీపై విమర్శలు




హైదరాబాద్ ఫిబ్రవరి 20,మన గళం: టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8 ఫార్మాట్‌పై క్రీడా వర్గాల్లో విపరీతమైన చర్చ కొనసాగుతోంది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రవేశపెట్టిన ప్రీ-సీడింగ్ విధానం కారణంగా గ్రూప్ స్టేజ్‌లో అద్భుతంగా ప్రదర్శన ఇచ్చిన టాపర్ జట్లకు అన్యాయం జరుగుతుందని క్రికెట్ అభిమానులు, విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సాధారణంగా ఏ టోర్నీలోనైనా గ్రూప్ స్టేజ్ ముగిసిన తర్వాత టాప్‌లో నిలిచిన జట్లకు తదుపరి రౌండ్లో కాస్త ఉపశమనం ఇచ్చేలా సీడింగ్ విధానం ఉంటుంది. కానీ ఈసారి ఐసీసీ టోర్నీ ప్రారంభం కాకముందే ఏ టీమ్ ఏ గ్రూపులో ఉండాలో ఫిక్స్ చేసేసింది. టోర్నీ ప్రారంభం కాకముందే సీడింగ్ వేయడం ప్రీ-సీడింగ్(జూతీవ-ంవవసఱఅస్త్ర) అని పిలవబడుతుంది. దీని అర్థం ఏదంటే ఒక జట్టు తన గ్రూపులో మొదటి లేదా రెండో స్థానంలో నిలిచినా ముందుగా నిర్ణయించిన స్లాట్‌లోనే ఉంటుంది. ఈ విధానం కారణంగా గ్రూప్ స్టేజ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన భారత్, వెస్టిండీస్, సౌతాఫ్రికా, జింబాబ్వే జట్లు ఒకే గ్రూపులో ఉండడం వల్ల రెండు జట్లు సెమీస్‌కు చేరకపోవాల్సి వస్తోంది. అదే సమయంలో రెండో స్థానంలో నిలిచిన పాకిస్థాన్, శ్రీలంక, న్యూజిలాండ్, ఇంగ్లండ్ జట్లకు సెమీస్ చేరడం సులభమవుతుంది. దీనివల్ల టాపర్లుగా నిలిచిన జట్లకు అన్యాయం జరిగిందని, ప్రతిభను గౌరవించేలా లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఐసీసీ స్పందనలో, భారత్, శ్రీలంక సంయుక్తంగా టోర్నీ నిర్వహిస్తున్నందున రవాణా, భద్రత, బ్రాడ్‌కాస్టింగ్ షెడ్యూల్‌లకు ముందుగానే ప్లాన్ చేసుకోవడం కోసం ప్రీ-సీడింగ్ విధానం తీసుకున్నామని, అభిమానులు, మీడియా కోసం సౌకర్యాన్ని కల్పించడమే ఉద్దేశమని తెలిపింది.

# భారత్ సెమీస్‌కు చేరదు..



**- పాక్ మాజీ ప్లేయర్ సంచలన వ్యాఖ్యలు**

హైదరాబాద్ ఫిబ్రవరి 20, మన గళం : టీ20 ప్రపంచ కప్ 2026లో టీమిండియా సెమీస్ ఫైనల్‌కు చేరే అవకాశం లేనని పాకిస్థాన్ మాజీ క్రికెటర్ మహమ్మద్ ఆమిర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సూపర్-8లో భాగంగా రేపటి నుంచి జరగనున్న మ్యాచ్‌లలో ఎనిమిది జట్లు టైటిల్ కోసం తగినంత శ్రమ చేస్తున్నారు. పాకిస్థాన్ న్యూస్ చానెల్ డిబెట్లో మాట్లాడిన ఆమిర్.. పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో తప్ప, లీగ్ దశలో ప్రతి మ్యాచ్‌లోనూ టీమిండియా బ్యాటింగ్ లైనప్ కుప్పకూలిందని, అందుకే ఈ జట్టు సెమీస్ చేరే అవకాశాలు తక్కువ అని పేర్కొన్నారు. మరోవైపు దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ జట్లు అద్భుతంగా ఆడుతున్నాయని, ఏ జట్టునైనా ఓడించగల సత్తా ఆ జట్లకు ఉందని చెప్పారు. అయితే ఇతర ప్యానెలిస్టులు టీమిండియా సెమీస్ చేరే అవకాశం ఉందని, పాక్, భారత్ మ్యాచ్‌ను సెమీస్‌లో ఆసక్తికరంగా చూడవలసిందని, టీమిండియా, దక్షిణాఫ్రికా జట్లు సెమీఫైనల్‌కు చేరుతాయని అభిప్రాయాలు తెలిపారు. 2009లో టీ20 వరల్డ్ కప్ గెలిచిన పాక్ జట్టులో సభ్యుడిగా ఉన్న ఆమిర్, రిటైర్ అయిన తర్వాత కూడా మీడియా ముందుకు వచ్చి తరచూ భారత్‌పై తన అక్కసును వ్యక్తం చేస్తున్నాడు. ఆయన వ్యాఖ్యలపై టీమిండియా అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఎడిషన్‌లో అమెరికా చేతిలో ఓడి లీగ్ దశలోనే ఇంటిబాట పడిన విషయం గుర్తు చేసుకొని, తన జట్టు గురించి ఆలోచించాలని, భారత్ మినహాయించి మరెవరూ ఆమిర్ మాటలపై ఊరుకోవద్దని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

# ఆసీస్ ఓటమికి కోహ్లీయే కారణమా?




హైదరాబాద్ ఫిబ్రవరి 20, మన గళం : 2026 టీ20 ప్రపంచకప్‌లో హాట్ ఫేవరెట్‌గా కనిపించిన ఆస్ట్రేలియా జట్టు గ్రూప్ దశలోనే ఓటమి పాలవ్వడం క్రికెట్ అభిమానులను ఆశ్చర్యంలో మునిగించింది. ముఖ్యంగా జింబాబ్వేతో జరిగిన కీలక మ్యాచ్‌లో ఎదురైన పరాజయం ఆసీస్ పతనానికి ప్రధాన కారణమైంది. ఈ సందర్భంలో ఆస్ట్రేలియా స్టార్ బౌలర్ పాట్ కమ్మిన్స్ ప్రసిద్ధి చెందిన సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ జట్టులో ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉన్నప్పటికీ, మాకు విరాట్ కోహ్లీ లేని స్థితి ఆ ఓటమికి కారణమని ఆయన చెప్పారు. జింబాబ్వేతో ఆడిన మ్యాచ్‌లో చివరి ఓవర్లలో అత్యవసర ఇన్నింగ్స్ ఆడగలిగే బ్యాటర్ లేకపోవడం వల్లే జట్టు పరాజయం పాలవ్విందని కమ్మిన్స్ వివరించారు. కోహ్లీ క్రీజులో ఉంటే ప్రత్యర్థి జట్టులో భయం ఏర్పడుతుందని, 37 ఏళ్ల వయసులో కూడా అతడి ఫిట్నెస్, ఆట పట్ల అంకితభావం అద్భుతమని ఆయన కొనియాడారు. కేవలం బ్యాటింగ్ సామర్థ్యమే కాకుండా, ఫిట్నెస్, ఆట పట్ల అంకితభావం కూడా యువ ఆటగాళ్లకు స్ఫూర్తిదాయకమని పాట్ కమ్మిన్స్ అభిప్రాయపడ్డారు.

# మా ప్రభుత్వం కారణంగా మేం నవ్వులపాలయ్యాం..




హైదరాబాద్ ఫిబ్రవరి 20 ,మన గళం :టీ20 ప్రపంచ కప్ 2026 టోర్నీలో బంగ్లాదేశ్ జట్టును అంతర్జాతీయ క్రికెట్ మండలి తప్పించిన ఘటనపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు మాజీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అస్రాఫుల్ హక్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భద్రతా కారణాలను సాకుగా చూపుతూ భారత్‌లో మ్యాచ్‌లు ఆడబోమని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు స్పష్టం చేయడంతో అంతర్జాతీయ క్రికెట్ మండలి ఈ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ మాటలకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు అమీనుల్ ఇస్లామ్ ప్రభావితమయ్యారని ఆరోపించారు. ఒక క్రికెట్ పరిపాలకుడిగా తాను నిబద్ధత, నిజాయితీని విశ్వసిస్తానని పేర్కొన్న ఆయన అమీనుల్ ఇస్లామ్ అమాయకుడని, నఖ్వీ వలలో పడ్డారని వ్యాఖ్యానించారు. నఖ్వీ ఒత్తిడికి లోనై తీసుకున్న నిర్ణయం వల్ల దేశానికి ప్రయోజనం కలగలేదని అన్నారు. ప్రపంచ కప్ వివాదం సమయంలో మా ప్రభుత్వం భారత్‌కు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాలకు సరైన కారణాలు లేవని విమర్శించారు. బంగ్లాదేశ్ క్రికెట్‌కు భారత నిర్వాహకుల మద్దతు ఎంతో అవసరమని స్పష్టం చేస్తూ గతంలో జగన్మోహన్ దాల్మియా కాలంలో తమ దేశానికి గౌరవం, గుర్తింపు లభించేదని గుర్తుచేశారు. ప్రస్తుతం కొంతమంది వ్యక్తుల నిర్ణయాలు మరియు ప్రభుత్వ చర్యల కారణంగా బంగ్లాదేశ్ క్రికెట్ ప్రపంచ వేదికపై నవ్వులపాలైందని సయ్యద్ అస్రాఫుల్ హక్ ఆవేదన వ్యక్తం చేశారు.

# అఫ్ఘనిస్థాన్ క్రికెట్‌కు చుక్కాని..




కాబూల్ ఫిబ్రవరి 20, 2026 :,మన గళం : ఒకప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌లో పెద్దగా గుర్తింపు లేని అఫ్ఘనిస్థాన్ జట్టు, గత కొన్నేళ్లలో సంచలనాలకు కేంద్రబిందువుగా మారింది. ఆ జట్టులో వచ్చిన ఈ అనూహ్య మార్పుకు ప్రధాన కారణంగా నిలిచింది హెడ్ కోచ్ జొనాథన్ ట్రాట్. తన అనుభవం, వ్యూహాత్మక ఆలోచన, యువ ఆటగాళ్లలో నమ్మకం నూరిపోసే తీరు ద్వారా ట్రాట్ అఫ్ఘన్ జట్టును కొత్త స్థాయికి తీసుకెళ్లాడు. మూడు సంవత్సరాల వ్యవధిలో అఫ్ఘనిస్థాన్ జట్టు ఆటతీరులో స్పష్టమైన మెరుగుదల కనిపించింది. ఒకప్పుడు చిన్న జట్టుగా భావించిన ప్రత్యర్థులు, ఇప్పుడు అఫ్ఘనిస్థాన్‌తో మ్యాచ్ అంటే అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రపంచకప్ గ్రూప్ దశలో చివరి మ్యాచ్ అనంతరం ట్రాట్ తన బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించడంతో ఆటగాళ్లు భావోద్వేగానికి లోనయ్యారు. జట్టుతో గడిపిన సమయం తనకు అమూల్యమని, ఆటగాడిగానే కాదు కోచ్‌గా కూడా మర్చిపోలేని అనుభవాలు పొందానని ట్రాట్ తెలిపాడు. ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై తొలి విజయం, ఇంగ్లండ్‌పై చారిత్రాత్మక గెలుపు, బలమైన జట్లపై ద్వైపాక్షిక సిరీస్ విజయాలు తన కోచింగ్ ప్రయాణంలో ముఖ్య ఘట్టాలుగా నిలిచాయని పేర్కొన్నాడు. కెనడాపై విజయానికి కీలకంగా నిలిచిన ఇబ్రహీం జద్రాన్ తన ఉత్తమ ఆటగాడు అవార్డును ట్రాట్‌కు అంకితం చేయడం అతనిపై ఉన్న గౌరవాన్ని చూపించింది. 2023 వన్డే ప్రపంచకప్‌లో శ్రీలంక, ఇంగ్లండ్, పాకిస్థాన్ వంటి మాజీ ఛాంపియన్లను ఓడించి అఫ్ఘన్ జట్టు సంచలనం సృష్టించింది. అంతేకాదు, పొట్టి ప్రపంచకప్‌లోనూ రషీద్ ఖాన్ నాయకత్వంలో సెమీఫైనల్‌కు చేరడం ఆ దేశ క్రికెట్ చరిత్రలో మైలురాయిగా నిలిచింది. ఐసీసీ నిర్వహించిన ప్రధాన టోర్నమెంట్‌లో సెమీఫైనల్ వరకు రావడం అఫ్ఘనిస్థాన్‌కు విశేష ఘనత. అయితే తాజా సీజన్‌లో మాత్రం జట్టు ఆశించిన స్థాయిలో రాణించకపోయినా, ట్రాట్ వేసిన పునాది భవిష్యత్తులో ఆ జట్టుకు మరింత బలం చేకూర్చనుందనే నమ్మకం క్రీడా వర్గాల్లో వ్యక్తమవుతోంది.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.